17,654 కంపెనీలు బంద్



గత 10 నెలల్లో మూతబడినట్టు రాజ్యసభలో ప్రకటించిన కేంద్రప్రభుత్వం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో దేశవ్యాప్తంగా 17వేలకుపైగా కంపెనీలు మూతబడ్డాయి. మంగళవారం రాజ్యసభలో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష మల్హోత్రా ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానం ప్రకారం.. గత ఏడాది ఏప్రిల్ మొదలు ఈ ఏడాది జనవరి 26 వరకు మొత్తం 17,654 సంస్థలు షట్‌డౌన్ అయ్యాయి. అయితే వీటిలో ఇతర సంస్థల్లో విలీనమైనవి, బడా సంస్థలకు అమ్ముడైనవి, నష్టాలతో చేతులెత్తేసినవి, ఆర్థిక సమస్యలతో మూతబడినవి అన్నీ ఉన్నాయని మంత్రి వివరించారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023-24) 22,044, అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) 84,801 కంపెనీలు బంద్ అయినట్టు తెలుస్తున్నది. మరోవైపు గడిచిన దాదాపు 10 నెలల్లో దేశంలో కంపెనీల చట్టం కింద కొత్తగా 1,38,027 కంపెనీలు నమోదైనట్టు కూడా మంత్రి తెలిపారు. అలాగే 2023-24లో 1,85,318 కంపెనీలు, 2022-23లో 1,59,302 కంపెనీలు నమోదయ్యాయి. ఇకపోతే గత ఐదేండ్లలో దేశంలో 339 విదేశీ కంపెనీలు ఏర్పాటయ్యాయని మల్హోత్రా వెల్లడించారు. ఈ ఏడాదిలో ఏపీ, ఢిల్లీ, కేరళల్లో ఒక్కోటి.. తమిళనాడులో రెండు వచ్చాయన్నారు. నిజానికి 2020 నుంచి భారత్‌లో విదేశీ సంస్థల నమోదు క్రమేణా తగ్గుతున్నట్టు చెప్పారు.

82 దర్యాప్తుల్లో నివేదికలు

గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో తీవ్ర మోసాల దర్యాప్తు కార్యాలయం (ఎస్ఎఫ్ఐవో) 82 దర్యాప్తు నివేదికల్ని సమర్పించినట్టు మంత్రి మల్హోత్రా తెలిపారు. కేవలం గత ఆర్థిక సంవత్సరంలోనే 2023-24 గరిష్ఠంగా 40 రిపోర్టులు వచ్చాయని వివరించారు. అయినప్పటికీ నయాపైసా రికవరీ లేదని స్పష్టం చేశారు. ఇక ఈ మూడేండ్లలోనే ఎస్ఎఫ్ఐవోకు మరో 26 కేసులను కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అప్పగించినట్టు చెప్పారు. గడిచిన ఐదేండ్లలోనైతే ఈ సంఖ్య 72గా ఉందన్నారు.

2,664 విల్‌ఫుల్ డిఫాల్టర్లు

గత ఏడాది మార్చి ఆఖరుకల్లా 2,664 మంది ప్రత్యేక రుణగ్రహీతలను ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులుగా వర్గీకరించినట్టు ఓ లిఖితపూర్వక సమాధానంలో రాజ్యసభకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. వీరిలో వ్యక్తిగత, విదేశీ రుణగ్రహీతలెవరూ లేరని స్పష్టం చేశారు. రుణాలను ఎగ్గొడుతున్నవారిపై కఠిన చర్యలను తీసుకొనేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో కలిసి కేంద్రం పనిచేస్తున్నట్టు వివరించారు.

86 వేలకు చేరువలో పుత్తడి

మరో రూ.500 పెరిగి రూ.85,800కి పదిగ్రాముల ధర

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: బంగారం ధరలు భగభగమండుతున్నాయి. సామాన్యుడికి అందనంత స్థాయికి చేరుకుంటున్న పుత్తడి మరో మైలురాయికి చేరువైంది. వరుసగా ఐదు రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం ధర మంగళవారం కూడా మరో రూ.500 ఎగబాకి రూ.86 వేలకి చేరువైంది. దేశరాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.500 పెరిగి రూ.85,800 పలికింది. ఆభరణాలు, రిటైలర్ల నుంచి డిమాండ్ అత్యధికంగా ఉండటం వల్లనే ధరలు పెరిగాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. జనవరి 1 నుంచి ఇప్పటి వరకు గోల్డ్ ధర రూ.6,410 లేదా 8 శాతం ఎగబాకి రూ.85,800కి చేరుకున్నది. నెల రోజుల క్రితం ఈ ధర రూ.79,380గా ఉన్నది. గత ఐదురోజులుగా పెరుగుతూ వచ్చిన వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉండటంతో కిలో వెండి రూ.500 తగ్గి రూ.95,500కి పరిమితమైంది. ధరలు తగ్గకముందు ఇది రూ.96 వేలుగా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర రికార్డు స్థాయి 2,872 డాలర్లకు చేరుకున్నది. కెనడా, మెక్సికో దేశాలపై ట్రంప్ విధించిన పన్ను వాయిదాపడటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం ధరలు పెరగడానికి ప్రధాన కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి.

భయపడి మూసేయలేదు

కంపెనీ షట్‌డౌన్‌పై హిండెన్‌బర్గ్ అధినేత అండర్సన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: అదానీ గ్రూప్ అవకతవకలపై సంచలనాత్మక రిపోర్టుల్నిచ్చిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్.. అనూహ్యంగా మూతబడిన విషయం తెలిసిందే. అయితే ఎవరికీ భయపడి తాను సంస్థను మూసేయలేదని ఈ అమెరికన్ షార్ట్ సెల్లర్ వ్యవస్థాపక అధినేత నాథన్ అండర్సన్ స్పష్టం చేశారు. తమపై లీగల్‌గాగానీ లేక వ్యక్తిగతంగాగానీ ఎవరూ ఏ రకమైన బెదిరింపులకు దిగలేదన్న అండర్సన్.. కేవలం పని ఒత్తిడి కారణంగానే హిండెన్‌బర్గ్ రిసెర్చ్‌ను మూసేసినట్టు పీటీఐకిచ్చిన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అదానీ గ్రూప్ స్టాక్ మార్కెట్లలో అక్రమాలకు పాల్పడిందంటూ 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రిసెర్చ్ ఓ రిపోర్టును విడుదల చేసిన సంగతి విదితమే. దీంతో అదానీ కంపెనీల షేర్లన్నీ ఒక్కసారిగా కుప్పకూలాయి. తీవ్ర నష్టాలను ఎదుర్కొన్నాయి. ఫలితంగా అటు గ్రూప్, అదానీ వ్యక్తిగత సంపద ఏకంగా 150 బిలియన్ డాలర్లకుపైగా కరిగిపోయింది. వ్యాపార-పారిశ్రామిక వర్గాల్లోనేగాక, రాజకీయంగానూ ఇది తీవ్ర దుమారాన్నే రేపింది. ఇక ఈ వ్యవహారంలో సెబీ చీఫ్ మాధవీ పురి బచ్ దంపతుల హస్తం కూడా ఉందని గత ఏడాది ఆగస్టులో మరో బాంబు పేల్చింది. దీంతో పార్లమెంట్ లోనూ ఆ ప్రకంపనలు కనిపించాయి. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 16న ఆశ్చర్యకరంగా హిండెన్‌బర్గ్ రిసెర్చ్‌ను మూసేస్తున్నట్టు, తమవద్ద అన్ని కేసుల దర్యాప్తులు అయిపోయినట్టు అండర్సన్ చెప్పారు. వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యత ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశారు. తాజా ఇంటర్వ్యూలోనూ అదే చెప్పారు. 2017లో మొదలైన ఈ కంపెనీ.. 8 ఏండ్లలో అనేక దేశ, విదేశీ కంపెనీలపై సంచలన రిపోర్టుల్నిచ్చింది. ఆ వివరాలను అమెరికా స్టాక్ మార్కెట్ రెగ్యులేటర్లు, దర్యాప్తు ఏజెన్సీలకు పంపింది.

మళ్లీ 78 వేల పైకి సెన్సెక్స్

1,400 పాయింట్లు లాభపడ్డ సూచీ • 380 పాయింట్లు ఎగిసిన నిఫ్టీ

ముంబై, ఫిబ్రవరి 4: దేశీయ స్టాక్ మార్కెట్లు రివ్వున ఎగిశాయి. మెక్సికో, కెనడాలపై విధించిన టారిఫ్‌లను తాత్కాలికంగా వాయిదావేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించడంతో అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా పుంజుకున్నాయి. ఇదే క్రమంలో గత కొన్ని రోజులుగా నష్టాలు ఏరులైపారుతున్న దేశీయ మార్కెట్లు కదంతొక్కాయి. మదుపరులుగు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ ఇంట్రాడేలో 1,472 పాయింట్లు లేదా 2 శాతం వరకు లాభపడింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 1,397.07 పాయింట్లు లేదా 1.81 శాతం అందుకొని 78,584.81 పాయింట్ల వద్దముగిసింది. దీంతో సూచీలు నెల గరిష్ఠ స్థాయికి చేరుకున్నట్లు అయింది. మరోసూచీ నిఫ్టీ సైతం 378.20 పాయింట్లు లేదా 1.62 శాతం అందుకొని 23,739.25 వద్ద ముగిసింది. జనవరి 3 తర్వాత సూచీలకు ఇదే గరిష్ఠ స్థాయి ముగింపు కావడం విశేషం. రిజర్వుబ్యాంక్ తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం కూడా మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. దీంతో 6 లక్షల కోట్ల మదుపరుల సంపద పెరిగింది. బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.5,95,996.51 కోట్లు పెరిగి రూ.4,25,50,826.11 కోట్లు(4.88 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. వాణిజ్య యుద్ధానికి తెరలేపిన ట్రంప్..ఇతర దేశాల నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో రెండు దేశాలపై విధించిన టారిఫ్ విషయంలో వెనక్కి తగ్గడం సూచీల్లో జోష్ పెంచిందని మోతీలాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ సిద్ధార్థ తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌పై మదుపరులు వేచి చూసే దోరణి అవలంభించినప్పటికీ గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలు పెరగడానికి ప్రధాన కారణం.

- ఎల్అండ్‌టీ 4.76 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- అదానీ పోర్ట్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, టాటా మోటర్స్, రిలయన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఏషియన్ పెయింట్, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, కొటక్ బ్యాంక్, ఎస్బీఐ, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్, టాటా స్టీల్, మహీంద్రా, ఎయిర్‌టెల్, టైటాన్, ఐటీసీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- ఐటీసీ హోటల్స్, జొమాటో, నెస్లె, మారుతి, హెచ్‌యూఎల్ షేర్లు నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే క్యాపిటల్ గూడ్స్ 3.42 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.59 శాతం, ఎనర్జీ 2.50 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 2.40 శాతం, పవర్ 2.31 శాతం, ఆర్థిక సేవలు 2 శాతం చొప్పున లాభపడ్డాయి. కానీ, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు పతనం చెందాయి.

టాటా కార్లపై భారీ డిస్కౌంట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఎంపిక చేసిన మాడళ్లపై టాటా మోటార్స్ తాజాగా లక్ష రూపాయల వరకు తగ్గింపు ప్రకటించింది. వీటిలో టియాగో, టిగోర్, ఆల్ట్రోజ్, పంచ్, నెక్సాన్, హరియర్, సఫారీ మాడళ్లున్నాయి. పెట్రోల్/సీఎన్‌జీ రకాల విషయానికొస్తే.. టియాగో మాడల్‌పై రూ.35 వేలు రాయితీ ఇస్తున్నది. రూ.20 వేలు కన్స్యూమర్ డిస్కౌంట్, మరో రూ.15 వేలు ఎక్స్ఛేంజ్ డిస్కౌంట్‌లున్నాయి. ఇలాగే టిగోర్‌పై రూ.45 వేలు, ఆల్ట్రోజ్‌లో రేసర్ మినహా మిగతా వేరియంట్లపై రూ.65 వేలు, పంచ్‌పై రూ.25 వేలు, నెక్సాన్ మాడళ్లపై రూ.45 వేల రాయితీలున్నాయి. ఇక ఎస్‌యూవీ మాడళ్లైన హరియర్, సఫారీ అన్ని డీజిల్ వేరియంట్లపై రూ.75 వేల వరకు డిస్కౌంట్ వస్తున్నది. మరోవైపు, ఆల్ట్రోజ్, నెక్సాన్ డీజిల్ అన్ని రకాలపై 65వేలు, 45వేల చొప్పున డిస్కౌంట్‌లున్నాయి. అయితే ఆల్ట్రోజ్ పెట్రోల్ రేసర్ వేరియంట్‌పై గరిష్ఠంగా లక్ష డిస్కౌంట్ ఉన్నది. జనవరిలోనూ కంపెనీ రూ.85 వేల తగ్గింపునిచ్చినది తెలిసిందే.

ఎన్ఎస్ఈ లాభం 3,834 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దేశంలో అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్ఎస్ఈ విశ్లేషకుల అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.3,834 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.1,975 కోట్ల లాభంతో పోలిస్తే 94 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో ఆదాయం ఏడాది ప్రాతిపదికన 21 శాతం ఎగబాకి రూ.3,974 కోట్ల నుంచి రూ. 4,807 కోట్లకు చేరుకున్నది. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల్లో రూ. 45,499 కోట్ల ఆదాయంపై రూ.14,780 కోట్ల నికర లాభాన్ని గడించింది.

హీరోకు 456 కోట్ల జీఎస్టీ నోటీసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దేశీయ ఆటోరంగ దిగ్గజం, ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్‌కు రూ.456.06 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు వచ్చింది. రాజస్థాన్‌లోని అల్వార్ సెంట్రల్ జీఎస్టీ అదనపు కమిషనర్ నుంచి ఈ తాఖీదులు అందాయి. 2017 జూలై నుంచి 2024 మార్చి వరకు సరఫరా జరిగిన వాహన విడిభాగాలు, ఇతరత్రా వాటి ధరలకు సంబంధించిన వ్యవహారంలో ఈ నోటీసులు జారీ అయ్యాయి. మరోవైపు ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీకి కూడా రూ.101. 95 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు వచ్చింది. గత ఐదు ఆర్థిక సంవత్సరాలకుగాను ఆయా రాష్ర్టాల్లో జీఎస్టీ షార్ట్ పేమెంట్లకు సంబంధించి ఈ నోటీసు విడుదలైందని మంగళవారం ఎల్ఐసీ తెలిపింది. కాగా, త్వరలో జీఎస్టీ శ్లాబులు, రేట్లపై జీఎస్టీ కౌన్సిల్ ఓ నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలియజేశారు.



జీపీ సిబ్బంది వెనక్కి తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు వెనక్కి..

- పైలట్ గ్రామాల్లో అందజేసిన అధికారులు
- ఇచ్చిన పది రోజులకే ఇంటింటికీ తిరిగి తీసుకుంటున్న జీపీ సిబ్బంది
- అనర్హులను ఎంపిక చేయడమే కారణం?
- అయోమయంలో ఇందిరమ్మ లబ్ధిదారులు

బయ్యారం, ఫిబ్రవరి4: ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు వెనక్కి తీసుకోవడంతో లబ్ధిదారుల్లో ఆయోమయం నెలకొంది. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని నామాలపాడు గ్రామపంచాయతీని పైలట్ గ్రామపంచాయతీగా అధికారులు ఎంపిక చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో గత నెల 26న గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అందులో భాగంగా ధర్మపురం గ్రామంలో 40 మందికి, రాయికుంటలో 32, నామాలపాడులో 42 మందికి మొత్తం 114 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అధికారులు అందించారు. అయితే పది రోజులు గడవక ముందే ఇచ్చిన మంజూరు పత్రాలు జీపీ సిబ్బంది వెనక్కి తీసుకున్నారు. ఇంటింటికి తిరుగుతూ మంజూరు పత్రాలు ఇవ్వాలని జీపీ సిబ్బంది అడగడంతో అర్థంకాక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కొందరు ఎందుకు తీసుకుంటు న్నారని ప్రశ్నించగా మళ్లీ ఇస్తాం.. అంటున్నారని వాపోయారు. మంజూరైన పత్రాలు మళ్లీ వెనక్కి తీసుకోవడంతో తమకు ఇస్తారా లేదా అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పూరి గుడిసెల్లో ఉండే వారు తమకు ఇల్లు మంజూరై కట్టుకుందామనుకునే లోపే అధికారులు పత్రాలు తీసుకోవడంతో అయోమయానికి గురవుతున్నారు. ఈ విషయంపై అధికారులను వివరణ కోరగా తనకు సమాచారం లేదని, ప్రారంభ సమయంలో లబ్ధిదారుల వద్ద రిజిస్టర్‌లో సంతకాలు తీసుకోలేదని, వాటి కోసం వెనక్కి తీసుకుంటున్నామని, మళ్లీ అందజేస్తామని మరికొందరు సమాధానం చెప్పడం గమనార్హం.

అనర్హుల ఎంపికే కారణమా..?

ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు అధికారులు వెనక్కి తీసుకోవడానికి అనర్హుల ఎంపికే కారణమని తెలుస్తున్నది. గతంలో ఇండ్లు మంజూరైన వారికి, పక్కా ఇండ్లు ఉన్న వారికి ఇండ్లు మంజూరైనట్లు, ఈ విషయాన్ని గుర్తించిన ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేయ డంతోనే వెనక్కి తీసుకుంటున్నట్లు సమాచారం. మళ్లీ సర్వే నిర్వహించి అర్హులకు మంజూరు పత్రాలు ఇస్తారని ప్రచారం జరుగుతున్నది.

మంజూరు పత్రం ఇచ్చి తీసుకున్నరు..

- సామ్రాజ్యం, ధర్మపురం, బయ్యారం, మహబూబాబాద్ జిల్లా

ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో అధికారులు పోయిన నెల 26న పత్రం ఇచ్చిన్రు. ఇల్లు కట్టుకుందామనుకున్నాం. కానీ పది రోజులు గడువక ముందే పంచాయతీ సిబ్బంది వచ్చి ఇంటి మంజూరు పత్రం ఇవ్వమని తీసుకెళ్లిన్రు. ఎందుకు తీసుకున్నరో తెల్వడం లేదు. అడిగితే సరిగ్గా సమాధానం చెప్పడం లేదు. మళ్లీ ఇస్తరో ఇవ్వరో తెలియడం లేదు.

వేతన వెతలు

- ఆరు నెలలుగా కంప్యూటర్ ఆపరేటర్లకు అందని వేతనాలు
- కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన



ఎంపీడీవో కార్యాలయంలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

నర్సింహులపేట, ఫిబ్రవరి 4: జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు ఐదు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందిపడుతున్నారు. జిల్లాలో 46 మంది కంప్యూటర్ ఆపరేటర్లు జీపీ, ఎంపీడీవో కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలకు ఒక్కొక్కరికి రూ.22,750 చొప్పున వేతనాలు చెల్లిస్తుండగా, ఐదారు నెలలుగా సుమారు రూ.లక్ష నుంచి రూ.లక్షా 20వేల వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తున్నదని చెబుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి వేతనాలు అదేలా చర్యలు తీసుకోవాలని కంప్యూటర్ ఆపరేటర్లు కోరుతున్నారు.

వేధింపుల ఘటనలో ఒకరిపై కేసు నమోదు

నెల్లికుదురు, ఫిబ్రవరి 4 : యువతిని వేధిస్తున్న ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర రమేశ్‌బాబు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన మేరుగు సాయికుమార్ అదే గ్రామానికి చెందిన ఓ యువతిని కొద్ది రోజులుగా వేధిస్తున్నాడు. భరించలేక యువతి గత నెల 29న యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ యువతి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సాయికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొత్త పోచారంలో మాట్లాడుతున్న బాదావత్ శ్రీను

15న సెలవు ప్రకటించాలి

గార్ల, ఫిబ్రవరి 4: సంతూ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఈ నెల 15న సెలవు ప్రకటించాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బాదావత్ శ్రీను ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం కొత్త పోచారం జడ్పీహెచ్ఎస్‌లో గిరిజన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. గిరిజన ఉపాధ్యాయులు హరి, హచ్చానాయక్, హీరాలాల్, నాగేశ్వరావు, ధనలక్ష్మి, రమేశ్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మరిపెడ, ఫిబ్రవరి 4 : పదో తరగతి విద్యార్థులు ఆంగ్లంలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఐపాస్-2025 స్టడీ మెటీరియల్ మంగళవారం మరిపెడ ఉన్నత పాఠశాల హెచ్ఎం అనంతరావు 50 మంది విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లా ఎల్టా ప్రధాన కార్యదర్శి బయగాని రామ్మోహన్‌ను అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉచిత స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

వీరభద్రస్వామి భక్తులకు తాగు నీటి సౌకర్యం

- వేసవిలో నీటి ఎద్దడి నివారణకు కృషి
- మిషన్ భగీరథ సీఈ లలిత
- కందికొండ వాటర్ ట్యాంకు పరిశీలన
- కురవిలో పర్యటన

కురవిలో అంగడి ఆవరణలో వాటర్ ట్యాప్‌లను పరిశీలిస్తున్న ఎస్ఈ లలిత

కురవి, ఫిబ్రవరి 4 : మహాశివ రాత్రి నుంచి జరగనున్న వీరభద్రస్వామి జాతరకు వచ్చే భ క్తులకు తాగునీరు సరఫరా చేస్తామని మిషన్ భగీరథ సీఈ జీ లలిత తెలిపారు. మంగళవారం ఆమె మండల కేంద్రంతోపాటు, మండలంలోని కందికొండ గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కందికొండ గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకున్న దని, కొత్త ట్యాంకును మంజూరు చేస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు, సిబ్బంది పనిచేస్తారని తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ కు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శులు విజయలక్ష్మి, నరేష్, ఎస్ఈ సురేందర్, ఈఈ కృష్ణారెడ్డి, డీఈఈ అనూష, ఏఈఈ (ఇంట్రా) అ నూష, ఏఈఈ(గ్రిడ్)హన్మంతు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

పెద్దవంగరలో దివ్యాంగుడి కిరాణం షాపును పరిశీలిస్తున్న డీడబ్ల్యూవో ధనమ్మ

పెద్దవంగర, ఫిబ్రవ రి 4 : దివ్యాంగుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు డీడబ్ల్యూవో ధనమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆమె మా ట్లాడుతూ.. దివ్యాంగులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో కమలాదేవి ఏసీడీపీవో ఇందిరమ్మ, సూపర్‌వైజర్ శోభ పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ సోమేశ్వర్‌రావుకు ఘన నివాళి

సోమేశ్వర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ రాజేశ్

డోర్నకల్, ఫిబ్రవరి 4 : డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా పని చేస్తున్న పోలోజు సోమేశ్వర్‌రావు (53) ఈ నెల ఒకటిన గుండెపోటుతో మృతిచెందగా, మంగళవారం పట్టణంలోని అశోక్ భవన్‌లో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. సోమేశ్వర్‌రావు చిత్రపటం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ భూక్యా రాజేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, సీపీఎం నాయకుడు అశోక్, విశ్వ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు దామోదరాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు పెంచాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రమీల

ఆశా డేలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రమీల

కురవి, ఫిబ్రవరి 4 : ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రమీల అన్నారు. మంగళవారం ఆమె బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆశా డే కార్యక్రమంలో పాల్గొన్నారు. పారామెడికల్ సిబ్బంది, ఆశకార్యకర్తలు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్థానికంగా ఉండి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బలపాల వైద్యాధికారి స్రవంతి, డాక్టర్ కరుణాకర్, డాక్టర్ యశస్విని, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భద్రమ్మ, యూడీసీ కుమారస్వామి, పీహెచ్ఎన్ శోభ, ఆరోగ్య విస్తరణ అధికారి స్వామి, హెల్త్ సూపర్‌వైజర్ సుమణి పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితాపై సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

డోర్నకల్, ఫిబ్రవరి 4 : గ్రామ పంచాయతీ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణపై మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. గతంలో వచ్చిన అభ్యంతరాలను తీసుకొని మార్పులు చేసినట్లు తెలిపారు. ఈ నెల 5,6 తేదీల్లో అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మీర్జా మున్వర్‌భేగ్, బీఆర్ఎస్ నాయకుడు చేరెడ్డి భిక్షంరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, బీఎస్పీ నాయకుడు విజయ్ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోమేటిక్ స్టార్టర్లు తొలగించాలి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఈ విజయ్

కురవి, ఫిబ్రవరి 4 : రైతులు ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించి ట్రాన్స్‌ఫార్మర్లపై ఒత్తిడి తగ్గించాలని విద్యుత్ డీఈ విజయ్ తెలిపారు. కురవి, లింగ్యాతండా(కె) గ్రామాల్లో మంగళవారం విద్యుత్ వినియోగదారులతో నిర్వహించిన అవగాహన సదస్సులో డీఈ విజ య్ పాల్గొని మాట్లాడారు. వినియోగదారులు నాణ్యమైన సర్వీస్ వైర్లను వాడాలన్నారు. ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించి, ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గించాలన్నారు. కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించా రు. కురవి ఏఈ శారద, సబ్ ఇంజినీర్ శ్రీనివాస్, ఎస్ఎల్ఐ సంజీవ, లైన్ ఇన్‌స్పెక్టర్ జంపిరావు, వెంకటేశ్ పాల్గొన్నారు.

చట్టాలకు లోబడి నడుచుకోవాలి

పెద్దవంగర, ఫిబ్రవరి 4 : ఎన్నికల నియమావళి, చట్టాలకు లోబడి ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని డీఎస్పీ కృష్ణకిశోర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా మంగళవారం మండలంలోని వడ్డకొత్తపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సభలు సమావేశాలకు అనుమతులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ గణేశ్, ఎస్సై క్రాంతికిరణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికలపై వడ్డెకొత్తపల్లిలో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కృష్ణకిశోర్